# ఉన్నత శిఖరం

"సార్!"

చదువుతున్న ఫైలులోంచి తల ఎత్తి చూసేను. తలుపుదగ్గర చిదంబరం.

'ఏంకావాలి?' అన్నట్లు అతనివంక చూస్తూ "రండి" అన్నాను.

మెల్లగా నా టేబిలు దగ్గరకు వచ్చేడు

"ఆఫ్ డే లీవు కావాలిసార్" అన్నాడు.

శెలవు అడుగుతున్న అతని ముఖంలో ఎటువంటి భావమూ చదవలేకపోయాను.

వినయంలేదు, తిరస్కారం లేదు, అభ్యర్థన అంతకంటే లేదు.

'నా లీవు నేను పెట్టుకుంటున్నాను. ఇవ్వననటానికి నువ్వెవరివి?' అన్నట్లుందని పించింది. కేవలం అదొక స్టేట్‌మెంట్, అంతే!

కనీసం నా వంక చూస్తూ అడగలేదు. అలా అడిగివుంటే కళ్ళల్లో భావాలనయినా గమనించ గలిగివుండేవాడిని"ఎందుకు?" విసుగ్గా ముఖం పెట్టి అడిగేను "అర్జెంటు పనిపడింది" విషయం స్థూలంగా తేల్చేస్తూ అన్నాడు.

'అంత అర్జెంటు పనేమిటో నాతోచెప్పి తగులడరాదా?' అని మనసులో అనుకున్నాడు.

"మిస్టర్... చిదంబరం...." గొంతులో గాంభీర్యం తెచ్చిపెట్టుకుంటూ అన్నాను. "ఈవేళ 'డిస్పేచ్' కావాల్సిన ఉత్తరాలు చాలా వున్నాయి. పన్నెండు ఆర్డర్లు ఇంకా మిగిలి పోయాయి. వాటన్నిటికీ 'వోచర్లు' తయారు చెయ్యాలి. 'గేట్‌పాస్'లు కూడా రాయాలి. ఇదంతా మూడుగంటల్లోగా జరగకపోతే గొడవున్‌లో నుండి పెయింట్ డబ్బాలు బయటకు రావు..." మాటలు ఆపివాచీ వంకచూసుకున్నాను.

"అప్పుడే పన్నెండున్నర అయిపోయింది ఈ పని అంతా ఎలా పూర్తవుతుంది? సారీ, ఈ పూటమీకు లీవు ఇవ్వటం కుదరదు..." మాటలు ముగించి అతని సమాధానానికి ఎదురుచూసే ప్రసక్తి లేదన్నట్లు ఎదుటి ఫైలు చూడటంలో మునిగిపోయాను.

మునిగి పోవటం కాదు! మునిగిపోయినట్లు నటించేను!! అంతే రెండు నిమిషాలు వరకూ చిదంబరం అక్కడ నుండి కదల్లేదు. తలదించుకున్న నాకు అతని ముఖం కన్పించక పోయినా, కదలకుండా నిలబడిపోయిన అతడి కాళ్ళు మాత్రం కన్పిస్తున్నాయి. ఆపరిస్థితి అట్టేసేపు కొనసాగనివ్వటం ఇష్టంలేక "యూ కెన్ గో టు యువర్‌సీట్" అన్నాను తల ఎత్తకుండానే.

ఆ మాటలు 'యుకెన్ గో టు హెల్' అనే రీతిలో చెప్పేను.

చిదంబరం మౌనంగా కదిలిపోయాడు.

అదే!! అదేనాకు అరికాలిమంట నెత్తికెక్కించే ప్రవర్తన! ఆ ప్రవర్తనే, అతని మీద నాకు సదభిప్రాయం కలగనివ్వకుండా మొదటినుండీ అడ్డుపడుతోంది. నిజంగా, అర్జెంటు

శెలవు కావల్సినవాడయితే, పరిస్థితి వివరించి చెప్పొచ్చు కదా!

అలా చెప్పడు మరో మాటకు పెదాలు విప్పితే ముత్యాలు రాలిపోతాయన్నట్లు ప్రవర్తిస్తాడు. బ్రతిమాలడు. కనీసం అభ్యర్ధన గొంతుకలో చూపించవచ్చునుకదా, అది కూడా చేయడు! బతిమాలితే అతని పరువు నష్టమయిపోతుందని కాబోలు! నా కింద పనిచేసే ఓ గుమస్తాకే అంత పొగరయితే, ఆఫీసరునయిన నాకెంత పొగరుండాలి? 'క్లిక్' మన్న శబ్దంతో తలఎత్తి చూశాను. 'హైడ్రాలిక్ డోర్ క్లోజర్' తో తలుపు మూసుకుంది.

చిదంబరం వెళ్ళిపోయాడు.

టేబిలు మీది ఫైలు పక్కకుతోసి బద్ధకంగా కుర్చీలో వెనక్కు వాలేను.

పెయింట్స్ తయారుచేసే మా ఫ్యాక్టరీ విశాఖపట్నానికి కొద్ది దూరంలో ఓ పల్లెటూరులో వుంది. తయారయిన రంగు డబ్బాలన్నీ పట్నంలోని గొడవున్‌కు చేరుస్తారు. గోడవున్‌కు ఆనుకుని మా ఆఫీసు వుంది. ఆఫీసు వ్యవహారాలన్నీ అప్పుడే అయిదు సంవత్సరాలుగా నేనే చూస్తున్నాను.

మాకు హైదరాబాద్‌లోనూ, విజయవాడలోనూ బ్రాంచీ ఆఫీసులున్నాయి.

ఈ మూడు ఊళ్ళమధ్య స్టేఫ్ బదిలీలు జరగటం మామూలే.

అదిగో! అలాటి సందర్భంలోనే ఆరునెలల క్రితం చిదంబరం విజయవాడ నుండి బదిలీమీద వచ్చేడు!

అతడు వచ్చి ఆరునెలలయిపోయినా ఈనాటికీ అతడి వ్యవహారం నాకు విచిత్రంగానే అనిపిస్తుంది. ఆఫీసులో ఎవ్వరితోటీ ఎక్కువగా మాట్లాడడు. ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పేసి ఊరుకుంటాడు. అతడు నవ్వటం నేనెప్పుడూ చూడలేదు. కనీసం 'జోక్' వేసినపుడు 'రియాక్ట్' అవటం కూడా గమనించలేదు.

మధ్యాహ్నం లంచ్‌సమయంలో అందరం కలిసి 'డైనింగ్‌హాలు'లో కూర్చుని ఎవరికేరియర్లు వాళ్ళు తింటాం. ఆఫీసరు, గుమస్తాలు అనే తేడా లేకుండా ఛలోక్తులు విసురుకుంటూ భోజనం చేస్తాం.

ఆ సమయంలో కూడా చిదంబరం అక్కడకిరాడు. తన టేబిలు దగ్గరే కుర్చీకి అంటిపెట్టుకుని వుండి పోతాడు. తనతోబాటు తెచ్చుకున్న టిఫిన్‌బాక్సులోని ఒక్క చపాతీ తినేసి మూతి తుడిచేసుకుంటాడు. అతడుచేరిన కొత్తలోనే అతడిని మార్చటానికి తోటి గుమస్తాలు ఎంతో ప్రయత్నం చేశారు. ఆఖరికి విసుగెత్తి ఊరుకున్నారు.

చిదంబరం నాకు అర్థంకాని ఓ పజిల్‌లాగ మిగిలిపోయాడు.

అతడి వ్యవహారం నాకో పెద్ద సమస్య

అయితే తోటి గుమస్తాలనుండి అతని మీద ఏదయినా ఫిర్యాదు వస్తుందేమోనని చాలా కాలం ఎదురుచూశాను. అలాటిదేమీ రాలేదు!!

'చిదంబరం అలా వుంటాడేమిటి?' అంటూ నేను ఒకటీ రెండుసార్లు ఎత్తిపొడిచి మాట్లాడినా ఎవ్వరూ రియాక్ట్‌కాలేదు.

'అతని తీరే అంత' అని ఒకరూ 'కొందర్ని అచ్చువేసి వదిలెయ్యాలిసార్' అని వేరొకరూ 'ఆయన పొగరు ఆయనకి వుంటే, మా పొగరు మాకూ వుంటుందిసార్' అని ఇంకొకరూ. 'మ్యూజియంలో పెట్టాల్సిన కేసు' అని కొంతమందీ; ఇలా వేరువేరు వ్యాఖ్యానాలు చేస్తూ తేలికగా నవ్వేశారే తప్ప; అతనిమీద నాకు ఏవిధమయిన రిపోర్టు ఇవ్వలేదు. పని విషయంలో వేలెత్తి చూపించటానికి ఆస్కారం ఇచ్చినట్లు కూడా హెడ్ గుమస్తా నాతో ఏనాడూ చెప్పలేదు.

ఆఫీసుకు రావటంలో ఆలస్యం అయినట్లు వినలేదు. సాయంకాలం అయిదయిపోతే మాత్రం ఒక్కనిమిషం కూడా ఆఫీసులో వుండడు.

'ఆఫీసరుగారు వెళ్ళేదాకా మనం వెళ్ళిపోకూడదు' అని ఒకసారి హెడ్ గుమాస్తా హెచ్చరిస్తే 'నాకిచ్చిన ఎపాయింట్‌మెంట్ ఆర్డరులో అలాంటిదేమీ రాసి లేదు. అందుకని ఆఫీసు టయిము కాగానే వెళ్ళిపోతున్నాను' అంటూ వెళ్ళిపోయాడట. ఆ తరువాత హెడ్‌క్లర్కు ఈ విషయం అతనికి చెప్పటం మానేశాడు.

ఆ విషయమై నేను కూడా అతడిని పిలిచి అడగలేదు. 'సమయం వస్తే దొరక్కపోతాడా!' అనే ఒక రకమయిన కసి నాలో వుండిపోయింది నిజానికి 'అయితే చిదంబరం మీద నాకు కసి ఎందుకు?' అనే విషయం ఆలోచిస్తే మాత్రం సమాధానం దొరకదు. అది అంతే!

చిదంబరం మనస్తత్వం గురించి ఆలోచిస్తూ బుర్రపాడు చేసుకోటం ఇష్టంలేక ఆవేళ చేయాల్సిన పనులగురించి, హైదరాబాద్ పంపాల్సిన 'స్టేట్‌మెంట్లు' గురించి 'గొడవున్‌లో స్టాకు' ఇన్‌వెంట్రీ గురించి, ఆలోచిస్తూ ఆఫీసుపనిలో నిమగ్నమయిపోయాను.

అయితే...

'చిదంబరానికి అవసరంలో 'ఆఫ్ డే లీవు రిజెక్టు' చేయగలిగాను కదా' అనే ఒక రకమయిన తృప్తి మాత్రం మనసులో ఏమూలనో చోటు చేసుకుంది కానీ, అదికూడా ఎంతసేపో నిలబడలేదు.

అరగంట తర్వాత నా పర్సనల్ సెక్రెట్రీ సుగుణ నా గదిలోనికి వచ్చి ఒక ఉత్తరం అందించింది.

"సార్! చిదంబరం శెలవుపెట్టి వెళ్లిపోయాడు, ఇదిగో లీవ్‌లెటరు..." అంటూ

నాకు పిచ్చెత్తినంత పనయింది!

"ఎవరితో చెప్పి వెళ్ళిపోయాడు? డామిట్! ఆఫీసులో డిసిప్లిన్ లేకుండా పోయింది. ఇది ఆఫీసనుకున్నాడా? అడివనుకున్నాడా?" దాదాపు అరిచినట్లే మాట్లాడేను

నాలో ఎన్నడూ అంతకోపం చూడలేదు సుగుణ, దాంతో ముఖం తేలేసినట్లు పెట్టింది! భయంగా నావంక చూస్తూ వుండిపోయింది కొంతసేపు.

"ఇందాకా మీ రూంలోకి వచ్చేడు కదా..."

"వస్తే?"

"మీతో చెప్పేదనుకున్నానుసార్"

ఆమె ముఖం భయంతో ఎర్రబడింది. అప్పుడు అర్థమయింది. నేనెంత గట్టిగా అరిచానో! ఎంత కోపం నా ముఖంలో చూపించేనో? రెండు నిమిషాలు మాట్లాడకుండా వుండిపోయాను. తర్వాత అడిగేను "నాతో చెప్పేడు, కానీ తీసుకోవద్దన్నాను, మరి ఎలా వెళ్ళిపోయాడు?"

"ఏమోసార్ అర్జెంటు పనివుందన్నాడు"

"పని ఏమిటో మీకు కూడా చెప్పలేదా?"

"చెప్పలేదుసార్. నేను అతడిని అడగలేదనుకోండి... అడిగినా చెప్పడు" అంది సుగుణ. అతని మూలంగా తాను నింద భరించవలసి వచ్చినందులకు ఇబ్బందిగా ముఖం పెట్టింది.

"సరే! ఆఫ్‌డే అబ్సెంటు మార్క్ చేయండి ఈవేళ! 'లాస్ ఆఫ్ పే' చేద్దాం. అప్పుడు కానీ బుద్ధిరాదు"

"అలాగే సార్" అంది సుగుణ

లీవులెటర్ మీద 'రిజెక్టెడ్' అని రాసి సంతకం చేసాను. కాగితం తీసుకుని సుగుణ వెళ్ళిపోయింది.

నాకు నెత్తిమీద నిప్పులు పోసినట్లుంది. చిదంబరం వ్యవహారం చూస్తే!

'అసలు అతడి ఉద్దేశం ఏమిటి? లీవు ఇవ్వనంటే ఎలా వెళ్ళిపోయాడు? ఎంత పొగరు? లాభంలేదు, పాఠం చెప్పాలంటే జీతం కోసెయ్యటమే మార్గం' అనుకున్నాను.

అవేల్టిగేట్ పాస్‌లపని సుగణకు అప్పగించేను. మిగిలిన పని ఇతర గుమస్తాలచేత చేయించేను. ఆ సాయంకాలం హైదరాబాద్ ఆఫీసునుండి ఫోను రావటంతో, రాత్రికి రాత్రే బయలుదేరి వెళ్ళవలసి వచ్చింది. తిరిగి విశాఖ చేరుకునేసరికి మరో నాలుగురోజులు గడిచిపోయాయి. చిదంబరాన్ని పిలిచి మాట్లాడటానికి నాకు వ్యవధి చిక్కలేదు.

మరో వారం గడిచిపోయింది.

అంతలో నా పుట్టినరోజు వచ్చింది.

నా జన్మదిన సందర్భంగా ఆఫీసువాళ్ళందరినీ మా ఇంటికి పిలిచి, పార్టీ ఇవ్వటం నాకు ప్రతీ ఏడాదీ ఓ అలవాటు! గత అయిదు సంవత్సరాలుగా ఈ ఆనవాయితీ కొనసాగిస్తున్నాను. ఆ పార్టీ పేరుతో నిజానికి నేను పడే శ్రమ అంటూ ఏమీలేదు. ఓ ఆఫీసు అసిస్టెంటు బల్లలు, కుర్చీలు, షామియానా ఏర్పాటు చేయిస్తాడు. మరొక గుమాస్తా టిఫినుసప్లయి వ్యవహారం చూసుకుంటాడు. ఇంకొంత మంది మా డాబా అలంకరణ చేస్తారు.

ఆఖరుకు పార్టీకి రమ్మని ఆహ్వానించటం కూడా నేను చేయను, సుగుణ నా

తరఫున అందర్నీ పిలిచేస్తుంది. అలా అందరూ తలో పనీ సర్దుకుంటే నాకు శ్రమ ఏముంది?

మరునాడు నా టేబిలుమీదకు ఈ ఏర్పాట్లకు సంబంధించిన బిల్లులు అన్నీ చేరుతాయి. ఆ బిల్లులు చెల్లించే అవకాశం కూడా నాకు వుండదు. ఎందుకంటే మా హెడ్ క్లార్క్ వచ్చి " ఆ బిల్లులు ఇలా ఇచ్చెయ్యండిసార్! మెటీరియల్ సప్లయి కాంట్రాక్టరు రమేష్ వీటి సంగతి చూసుకుంటాడు" అంటూ వాటిని తీసుకుపోతాడు.

ఒకటి రెండుసార్లు వద్దంటూ వారించటం, 'పరవాలేదుసార్' అంటూ రమేష్ వాటిని చెల్లించటం ఇదంతా మామూలుగా జరిగే కార్యక్రమమే. ఓ ఏడాది రమేష్ అయితే మరొక ఏడాది మరో నరేష్ ఇలా ఎవరో ఒకరు ఆ వ్యవహారం సర్దేసుకుంటారు.

అందువలన దమ్మిడీ ఖర్చు, కనీసపు శ్రమ లేకుండా నా జన్మదినోత్సవాలు అతివైభవంగా గత అయిదేళ్ళుగా జరుపుకొంటున్నాను. అదేవిధంగా ఈ ఏడాది కూడా నా పుట్టినరోజు పార్టీ మా ఇంటిడాబా మీద ఏర్పాటయింది.

ప్రతి సంవత్సరం కంటే మేరింత ఆడంబరంగా ఈసారి డాబా అలంకరించేరు. ఫోటోగ్రాఫర్ని పిలిచి కలర్ ఫోటోలు తీయించే ఏర్పాటు కూడా చేశారు.

సాయంకాలం ఆరున్నర అయ్యేసరికి స్టాఫ్ ఒక్కరొక్కరే రావటం ఆరంభమయింది. ఏడుగంటలయ్యేసరికి అందరూ చేరుకున్నారు. జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు.

పార్టీ ఆరంభమయింది.

ఎంతసేపు ఎదురుచూసినా రానిది ఒక్కడే! చిదంబరం!!

'జీతం కోత పెట్టినందులకు అక్కసుకాబోలు' అనుకున్నాను. చిదంబరం ఆ పార్టీకి రాకుండా నా అహం మీద దెబ్బకొట్టినట్లు అనిపించిందినాకు. అతనిపై కసిమరింత అధికమయింది.

'మా స్టేఫ్' ఎవ్వరూ అతడు రాకపోవటాన్ని పెద్దగా పట్టించుకున్నట్లు అనిపించలేదు. అంతేకాదు అతడు రావటమంటూ జరిగితే అదేదో ఆశ్చర్యపడవలసిన విషయంలా మాట్లాడుకున్నారు.

నవ్వుల మధ్యలో పాప్ మ్యూజిక్ సందడిలో ఆహ్లాదకరమయిన వాతావరణంలో పార్టీ పూర్తయిపోయింది.

తరువాత

నేనే స్వయంగా అందరినీ కారులో వాళ్ళ వాళ్ళ ఇళ్ళ దగ్గర దింపేను, మూడు ట్రిప్పుల్లో మర్యాదపూర్వకంగా ప్రతి ఏటా చేస్తున్న పని ఇది. మూడో ట్రిప్పులో అందరినీ దింపటం ముగించి తిరిగి వస్తుండగా దారిలో చిదంబరం కనిపించేడు. కార్ హారన్ విని తుళ్ళిపడ్డట్లు వెనక్కు చూస్తే అప్పుడు అతడిని గుర్తించి కారు అతడి ప్రక్కగా తీసుకువెళ్ళి ఆపేను.

అతడు కారులోకి ముఖంపుట్టి, 'నమస్కారంసార్.... మీ ఇంటికే

బయలుదేరాను... 'మీరు పదండి, నేను నడిచి వచ్చేస్తాను' పావుగంట సమయంచాలు" అన్నాడు.

నేను డోర్ తెరచి "ఎక్కండి ఫర్వాలేదు" అన్నాను. చిదంబరం మౌనంగా ఎక్కి కూర్చున్నాడు.

కారు బయలుదేరింది. కొన్ని నిమిషాలు మా మధ్య మాటలు లేవు.

ఆవేళ ఆఫీసులో జరిగిన విషయానికి క్షమాపణ చెప్పుకుంటాడేమోనని కొంతసేపు నిరీక్షించేను. కానీ అలాటి ప్రయత్నం ఏదీ అతడు చేసేలా నాకు అనిపించలేదు.

ఇక ఉండబట్టలేక నేనే ఆ విషయం గుర్తుచేశాను

"చిదంబరం"

"చెప్పండి"

"ఆవేళ మీరు చేసిన పనినాకు నచ్చలేదు"

" ఏ రోజు?"

"అదే నేను వద్దని చెప్తున్నా వినకుండా అఫ్ డే లీవు లెటరు ఇచ్చివెళ్ళిపోయిన రోజు..." మనసులో కసి వుండటం వలన కాబోలు మాటలు అనుకోకుండా కటువుగానే వచ్చేయి బయటకు.

ఈ ప్రస్తావనకు చిదంబరం సిద్ధంగా వున్నట్లు అన్పించలేదు నాకు!

కొంతసేపు ఇబ్బంది కరమయిన నిశ్శబ్దం మా మధ్య చోటుచేసుకుంది.

ఈ విషయంలో చర్చించటం నిజానికి అప్రస్తుతం, కానీ ఆ ఆలోచనను మనసుమూల పొరల్లోనికి నెట్టేశాను. చిదంబరం నుండి ఎంతకూ సమాధానం రాకపోయేసరికి...

"ఏం మాట్లాడరేం?" అంటూ రెట్టించేను.

ఇక లాభం లేదనుకున్నట్లున్నాడు, నోరు విప్పేడు.

"మా పక్కింటి ముసలాయనకి సీరియస్‌గా వుందని ఆవేళ కబురు వచ్చిందినాకు... అందుకని.... వెళ్ళిపోయాను"

"మీ పక్కింటి ముసలాయనకి.... సీరియస్‌గా వుందని కబురొస్తే.... వెళ్ళిపోయారా?... ఆయన మీ కేమవుతాడు?"

ప్రతి మాట విరుస్తూ వ్యంగ్యంగా అడిగేను. నా మాటల్లోని విరుపును గుర్తిచినట్లు లేదుచిదంబరం. "చుట్టరికం ఏమీలేదు" అన్నాడు.

"మరి?... "అర్థోక్తిగా ఆపి, అతడి వంక చూసేను.

"పక్కింటి మనిషి... అంతే. పక్కింట్లోమనిషికి సీరియస్‌గా వుందని కబురు వస్తే సాయంచేయవద్దా?" అతడి గొంతు అతి సహజంగా వుంది.

దానితో నాకు అరికాలిమంటనెత్తికెక్కింది.

"చిదంబరం! పక్కింటి ముసలాయనకీ, ఎదరింటి ముసిలిదానికీ, వెనకింటి పడుచుపిల్లకీ, చాకిరీ చేస్తూ కూర్చుంటే మరి, ఆఫీసుపని ఎవరు చేస్తారనుకున్నారు?" కాస్త కోపం ధ్వనించేలా గొంతుమార్చి మరీ అడిగేను.

దెబ్బతిన్నట్లు ముఖంపెట్టి ఒక్క నిమిషంపాటు మౌనంగా వుండిపోయాడు చిదంబరం.

తర్వాత మెల్లగా అన్నాడు.

"ఆఫీసు పని నేను ఒక్కడినీ చేయనంతలో ఆగిపోదుసార్... ఎవరో ఒకరు చేస్తారు... ఆరోజున డిస్పెచెస్ ఆగిపోయాయా?..". అంటూ కొంత సేపు ఆగి మళ్ళీ అన్నాడు... "రోజూ అలా వెళ్ళిపోవటంలేదు కదా! ఆవేళ అలావెళ్ళాల్సి వచ్చింది...మా పక్కింటి ముసలాయనకి దిక్కెవ్వరూ లేరు... ఒక్క కొడుకు తప్ప.... అతడేమో అవిటివాడు! నడిచి ఎక్కడికీ వెళ్ళలేడు అతడి కాలకృత్యాలు తీర్చుకునేందుకే మరొకరి సాయం కావాలి.... ఇద్దరూ దిక్కులేని పక్షులే.... అందువలన కబురొస్తే వెళ్ళక తప్పింది కాదు ఆవేళ! రిక్షాలో ఎక్కించి హాస్పిటల్‌లో చేర్పించేను.... మన చుట్టం కానంత మాత్రాన సాటి మనిషిని ఆపదసమయంలో, గాలికి వదిలేయటం న్యాయం కాదుగదా"

ఏమాత్రం ఆవేశం లేకుండా మాట్లాడేడు. అతడి ఆఖరు వాక్యంతో ఒళ్ళు మండి పోయిందనాకు. పుండుమీద కారం చల్లినట్లయింది.

నాకే నీతులు చెప్తున్నాడా?

అసలు, ఇదంతా ఓ కట్టుకథ ఎందుకు కాకూడదు? నాకు అతడు చెప్పే విషయం నమ్మబుద్ధికాలేదు సరిగదా, పరోపకారం మాటలు అస్సలు మనసుకు పట్టలేదు.

ఆవేళ సంగతి సరే మరి, ఈవేళ నా పుట్టినరోజు పార్టీకి ఎందుకురాలేదు? సరిగ్గా ఆరున్నరగంటలకు రమ్మని సుగుణ అందరితోటి చెప్పింది! మరి ఇప్పుడా రావటం?

దారిలో దొరికిపోయాడు కనుక, మరి మార్గాంతరం లేక, మీ ఇంటికే వస్తున్నట్లు చెప్పేడా? బహుశ: అదే నిజమయివుంటుంది.

అంతలో కారు మా ఇంటికి సమీపించింది. గేటు తెరవటానికి కారు దిగేను.

చిదంబరం కూడా తలుపు తెరచి అవతల ప్రక్కకు దిగేడు.

"మీ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి వెళ్దామని వచ్చేను..." అంటూ ఎదరకు వచ్చి "మెనీ మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే" అన్నాడు.

"థేంక్యూ.... సాయంకాలం నలుగురితో బాటు వచ్చి ఈ ముక్కలు చెప్పివుంటే చాలా అనందించేవాడిని.... అయినా మీకు ప్రజాసేవకే సమయం చాలటంలేదు.... లీవులుపెట్టాల్సివస్తోంది! అలాంటిది పార్టీలకు ఎలావస్తారు? "అంటూ వ్యంగ్యంగా మరో విసురు విసిరేను.

ఈసారి, చిదంబరం రియాక్ట్ అయ్యేడు

అతని గొంత స్థాయి పెరిగింది.

“సార్ మీ జన్మదినోత్సవం సందర్భంగా తోరణాలు కట్టటానికీ, వేడుకలలో పాల్గొనటానికీ నేనొక్కడినీ రాకపోయినా, నిజానికి ఫర్వాలేదు. అందువల్ల మునిగిపోయింది కూడా ఏమీలేదు. వేడుకలకు వచ్చి విందుల్లో పాల్గొని, శుభాకాంక్షలు తెలిపేటందుకు బోలెడంత మంది వున్నారు. కానీ మా పక్కింటి ముసలాయన చచ్చిపోతే శవవాహనానికి ఒక్కరంటే ఒక్కరు కూడా ముందుకు రాలేదుసార్... మధ్యాహ్నం పన్నెండు గంటలకు చనిపోయాడాయన.... సాయంకాలం ఆఫీసు అయిన తరువాత నేను వెళ్ళే వరకూ కనీసం కిందకు దింపి, చాపమీద పడుకో బెట్టటానికి కూడా ఎవ్వరూ లేకపోయారుసార్.... ప్రేమ సమాజంలోని మనుష్యుల సహాయంతో నేనేస్వయంగా శ్మశానానికి తీసుకువెళ్ళి కొరివికి నిప్పు అంటించేను. దరిద్రుడి పెళ్ళికి వడగళ్ళవానట. దిక్కులేని వాడి చావుకి అన్నీ తడికర్రలే సమకూడేయి. శవం కాలేసరికి ఆలస్యమయిపోయింది. తంతు ముగిసింది. ఇంటికి వెళ్ళి స్నానం చేసి వచ్చేసరికి మరింత ఆలస్యమయిపోయింది. మరోలా అనుకోకండి”

మాటలు ముగించి నా సమాధానానికి ఎదురుచూడకుండా చకచకా నడిచి వెళ్ళిపోయాడు.

నా వీపు మీద ఎవరో కొరడాతో ఛళ్ళున చరిచినట్లయింది!

చిదంబరం లోని మనిషిని నేనెంత తక్కువగా అంచనా కట్టేను? అతడిముందు నేనెంత అల్పుణ్ణి!

దూరంగా చీకటిలో, నడిచిపోతున్న చిదంబరం నాకు మొట్టమొదటిసారిగా, కదిలిపోతున్న మహోన్నత శిఖరంలా కనిపించేడు!!! ★

(యువ మంత్లీ దీపావళి సంచిక 1980)